ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

- రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే..
- ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు


భూంపల్లిలో నృత్యం చేస్తున్న మహిళలు


భూంపల్లిలో మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రావు

సదాశివనగర్ : ఒక్కసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు అన్నారు. గురువారం మండలంలోని యాచారం, వజ్జపల్లి తండా, ఉత్తునూర్, వజ్జపల్లి, తిమ్మోజీవాడి, తుక్కోజీవాడి, భూంపల్లి, లింగంపల్లి, మోడెగాం, పద్మాజీవాడి, కల్వరాల్ గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. మదన్‌మోహన్‌కు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రతి నెల వచ్చే వేతనంలో కేవలం ఒక్క రూపాయి ఉంచుకొని మిగతా డబ్బులను ప్రజల సంక్షేమం కోసమే ఖర్చు చేస్తానన్నారు. గ్రామాల్లో ప్రజలు పార్టీలకతీతంగా చందాలు వేసుకొని జాజాల సురేందర్‌ను గెలిపిస్తే అమ్ముడుపోయి నియోజకవర్గ అభివృద్ధిని మరిచాడన్నారు. చందాలు వేసి గెలిపించిన ప్రజలను కలవడం లేదన్నారు. బీఆర్ఎస్ వైఫల్యాలను వివరించారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం లేదని, రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేయడం లేదన్నారు. కానీ వ్యక్తి చనిపోగానే రేషన్ కార్డులో పేర్లను కట్ చేసి బియ్యం నిలిపి వేస్తున్నారన్నారు. కొత్త పింఛన్ల జాడ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. తాను ఎన్నో జాబ్‌మేళాలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించినట్లు తెలిపారు. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు లింగాగౌడ్, సంపత్‌గౌడ్, దేవేందర్, అశోక్‌రావు, సంగారెడ్డి, లక్ష్మిబాయి, బత్తుల రాములు, ఇర్షాదొద్దీన్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.


కన్‌కల్‌లో ప్రచారం చేస్తున్న మదన్‌మోహన్ సోదరి శోభ, నాయకులు

తాడ్వాయి : తాడ్వాయి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో గురువారం కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ సోదరి శోభ, నాయకులు ప్రచారం చేశారు. మదన్‌మోహన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరికలు

రాజంపేట : మండలంలోని గుండారం గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువసేన నాయకులు గురువారం మదన్‌మోహన్‌రావు కుమారుడు కార్తీక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కార్తీక్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ధర్మ సమాజ్ పార్టీని గెలిపించాలి



దోమకొండ : కామారెడ్డి నియోజకవర్గంలో ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి ఉగ్రవాయి బోలేశ్వర్‌ను గెలిపించాలని ఆ పార్టీ అధినేత విశారదన్ మహరాజ్ కోరారు. తమ పార్టీ తెలంగాణలోని అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు. ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల తరఫున ధర్మ సమాజ్ పార్టీ అగ్రవర్ణాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుందన్నారు. ఉచిత విద్య, వైద్యం లక్ష్యంగా పార్టీ పనిచేస్తుందన్నారు. నాయకులు సుమన్, అరవింద్, పర్శరాములు, రాజేష్, మురళి, లక్ష్మణ్, శ్రీను పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

నస్రుల్లాబాద్ : మండల కేంద్రంలో గల రైతు వేదికలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పాల్త్య విఠల్ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి డివిజనల్ స్థాయి అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

పెద్దకొడప్‌గల్ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కోనారెడ్డి సూచించారు. గురువారం స్థానిక బస్టాండ్‌లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు వివరాలు, ఓటీపీలు చెప్పొద్దన్నారు.

బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు



భిక్కనూరు: బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని రాష్ట్ర ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డిలో ప్రచారం చేశారు. సింగిల్ విండో చైర్మన్ రాజాగౌడ్, సతీష్‌రెడ్డి, బాబు, బాలాజీ పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేటలో గురువారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఆముద నాగరాజు, చింతల స్వామి, నల్లవెల్లి అశోక్, సాయిబాబా, దుబ్బని శ్రీకాంత్ పాల్గొన్నారు.

సింగిల్ విండో మాజీ డైరెక్టర్ మృతి



భిక్కనూరు : భిక్కనూరు సింగిల్ విండో మాజీ డైరెక్టర్ జేపీ రాధాకిషన్‌గౌడ్ గురువారం మృతి చెందారు. ఆయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆయన కుటుంబికులకు రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. జెడ్పీటీసీ పద్మనాగభూషణంగౌడ్, సర్పంచ్ తుక్కి వేణు, నర్సింహరెడ్డి, నాగభూషణంగౌడ్ ఉన్నారు.

అభివృద్ధిని చూసి చేరికలు



విప్ గంప గోవర్ధన్ సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు, ముజీబొద్దీన్ సమక్షంలో వ్యాపారులు

ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం : సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని చూసి పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. పట్టణంలోని 15వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నానితో సహా 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. కామారెడ్డిలోని విప్ నివాసం వద్ద గురువారం జరిగిన చేరికల కార్యక్రమంలో భాగంగా వారందరికీ ప్రభుత్వ విప్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. సీఎం రాకతో కామారెడ్డి అభివృద్ధిలో అగ్రగామి కానుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: కాంగ్రెస్ మైనారిటీ సెల్ భిక్కనూరు అధ్యక్షుడు పర్వేజ్ గురువారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సర్పంచ్ తున్కి వేణు, నాయకులు పాగుడ శ్రీనివాస్, సామల భరత్‌కుమార్, నర్సింలు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ముజీబొద్దీన్ సమక్షంలో..

కామారెడ్డి టౌన్: రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల నుంచి వచ్చి పట్టణంలో స్థిరపడిన వ్యాపారులు, చౌదరి పరివార్‌లు గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ సమక్షంలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేసీఆర్ గెలుపు కోసం కృషి చేస్తామని వ్యాపారులు తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కుంబాల రవియాదవ్, ముప్పారపు ఆనంద్, అశోక్, శైలేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయాలి

డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయాలని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఇస్లాంపూర, గౌలీగూడ, దాలమల్ గుట్ట కాలనీలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బాన్సువాడను మున్సిపాలిటీ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.650 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేసిన ఘనత పోచారం శ్రీనివాస్‌రెడ్డికే దక్కిందన్నారు. బీఆర్ఎస్‌ను మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. స్థానికంగా ఉండే నాయకుడు పోచారం అన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎజాస్, హకీం, రఫీ, యునుస్, తార, రుక్మిణి, బుల్లెట్ రాజు, మహేష్, గంగాధర్, బాబా ఉన్నారు.


బాన్సువాడలో ప్రచారం చేస్తున్న భాస్కర్‌రెడ్డి

కేసీఆర్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి



దేవునిపల్లిలో ప్రచారం చేస్తున్న పున్న రాజేశ్వర్, చిన్నమల్లారెడ్డిలో శశాంక్‌ను సన్మానిస్తున్న నాయకులు

కామారెడ్డిరూరల్ : సీఎం కేసీఆర్‌ను గెలిపిస్తే కామారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తనయుడు గంప శశాంక్ అన్నారు. గురువారం మండలంలోని లింగాయిపల్లి, దేవునిపల్లిలోని 10వ వార్డు పరిధిలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేమె అపర్ణ రవి, కౌన్సిలర్లు ఉరుదొండ వనిత, ఆకుల రూప రవికుమార్, కాసర్ల గోదావరిస్వామి, పోలీస్ క్రిష్టాజీరావు, నిట్టువెంకట్‌రావు, చెట్కూరి బీరయ్య ఉన్నారు.

కామారెడ్డి టౌన్: కేసీఆర్ గెలిచిన తర్వాత కామారెడ్డి అభివృద్ధిలో నంబర్ వన్ స్థానంలో నిలుస్తుందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తనయుడు శశాంక్ అన్నారు. గురువారం కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి, కొట్టాలపల్లి, తిమ్మక్‌పల్లి, లింగాయపల్లి, నర్సన్నపల్లిలో ఆయన ప్రచారం చేశారు. నాయకులు భాను ప్రసాద్, అనిల్‌రెడ్డి, నితీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

'విద్యార్థి సంఘాలు ఏకమై కేసీఆర్‌ను ఓడించాలి'

కామారెడ్డి టౌన్: విద్యార్థి సంఘాలన్ని ఏకమై కేసీఆర్‌ను ఓడించాలని కామారెడ్డి విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలన పదేళ్లలో రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులు, యువకులు ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల నిధులు విడుదల చేయలేదన్నారు. నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. ఉద్యోగాల భర్తీ లేవన్నారు. టీఎస్‌పీఎస్ పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డిలో పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ఓడించేందుకు కృషి చేస్తామన్నారు. ఎన్ఎస్‌యూఐ, టీజేఎస్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్ విద్యార్థి సంఘాల నాయకులు ఐరెని సందీప్, లక్ష్మణ్ యాదవ్, ముదాం అరుణ్, సురేష్, విఠల్, జబ్బార్, రోషన్, భరత్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

బీఆర్ఎస్‌తోనే పేదల సంక్షేమం


వాజిద్‌నగర్‌లో మాట్లాడుతున్న హన్మంత్ సింధే


ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలు, ప్రజలు

జుక్కల్ బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే

బిచ్కుంద: రాష్ట్రంలో పేదల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మనలాంటి పథకాలు కొనసాగడం లేదని జుక్కల్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్‌సింధే అన్నారు. గురువారం మండలంలోని బండారెంజల్, గుండెనెమ్లి, వాజిద్‌నగర్, పుల్కల్, ఫత్లాపూర్, రాజుల్లా గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం కోసం కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. దేశంలో ఎక్కడ లేని విధంగా పథకాలు అమలు చేశామని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు విని మోసపోవద్దని వేడుకున్నారు. స్థానికేతరులు ఓట్ల కోసం వస్తున్నారని, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండే తనను గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ మన జిల్లా నుంచే పోటీ చేస్తున్నారని, అన్ని సమస్యలు తీరుతాయని చెప్పారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎంపీపీ అశోక్, వైస్ ఎంపీపీ రాజు పటేల్, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, సర్పంచ్ అనుయా, ఎంపీటీసీలు సాయిలు, సిద్దిరాములు, నాయకులు వెంకట్‌రావు, నాల్చర్ రాజు, అసద్ అలి, కలీంపటేల్, కిష్టారెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మద్నూర్ : తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన మైనారిటీ నాయకుడు సుల్తాన్ కాంగ్రెస్ పార్టీని వీడి సింధే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. శుక్రవారం హన్మంత్‌సింధే మద్నూర్‌లో ప్రచారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ సురేష్ తెలిపారు.

కేసీఆర్‌తోనే తండాలకు గుర్తింపు

నిజాంసాగర్ : ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనతోనే తండాలకు గుర్తింపు వచ్చిందని ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు అన్నారు. గురువారం మహమ్మద్ నగర్ మండలంలోని పిప్పిరేగడి తండా, గాలీపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, సీడీసీ చైర్మన్ గంగారెడ్డి, గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్‌అలీ, లక్ష్మారెడ్డి, లక్ష్మీనారాయణ, చెందర్‌రాథోడ్, నారాయణ, కడావత్ శ్రీనివాస్ ఉన్నారు.


బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయం

ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్

తాడ్వాయి: సీఎం కేసీఆర్ మూడోసారి సీఎంగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. ఆయన గురువారం మండలంలోని తాడ్వాయి, కృష్ణాజీవాడి, బ్రహ్మాజీవాడి గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నుంచి సుమారు 200మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి జాజాల కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులకు ఆకర్శితులై పార్టీలో చేరుతున్నారని చెప్పారు. స్థానికంగా ఉండి ప్రజలకు సేవలు చేసే తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఎంపీపీ రవి, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింలు పాల్గొన్నారు.


కృష్ణాజీవాడిలో మాట్లాడుతున్న జాజాల

ఎల్లారెడ్డిలో నాయకుల ప్రచారం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతు కారు గుర్తుకు ఓటు వేసి జాజాల సురేందర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు జలందర్‌రెడ్డి, ప్యాలాల రాములు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు బోనాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఆధ్యాత్మికం..

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



నిజాంసాగర్ : మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లిలో గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఊర చెరువు కట్టపై నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించారు. సర్పంచ్ సుబ్బూరి సాయిలు, ఉప సర్పంచ్ విఠల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గోగుల పండరి, విఠల్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉర్సు ప్రారంభం

బాన్సువాడ రూరల్: మండలంలోని బాన్సువాడ–ఎల్లారెడ్డి ప్రధాన రదారిలో కొత్తాబాది సమీపంలో వెలసిన హజ్రత్ సూఫీ సయ్యద్ షా మొహ్మద్ ఐనోద్దీన్ దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. దర్గాను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ షా మొహ్మద్ యూసూఫ్ ఉద్దీన్ ఆధ్వర్యంలో భక్తులు కొత్తాబాది నుంచి సందల్ తీసుకుని వచ్చారు. దర్గాలో పూలు, చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. శుక్రవారం దీపారాధన, ఖురాన్ బోధనలు, ఖవ్వాలి కార్యక్రమం ఉంటుందని, 18న ఉత్సవాలు ముగుస్తాయని భక్తులు తెలిపారు.

ఓం శాంతి కేంద్రంలో దీపావళి ఉత్సవం



కామారెడ్డి అర్బన్: ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఓంశాంతి కామారెడ్డి కేంద్రంలో గురువారం దీపావళి ఉత్సవం నిర్వహించి కేక్ కట్ చేశారు. భజనలు, ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రసాదం అందజేశారు. నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి జయదీదీ, ప్రతినిధులు పాల్గొన్నారు.

బస్సులు రాక విద్యార్థులకు ఇక్కట్లు

బాన్సువాడ రూరల్ : సమయానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సీజన్ కావడంతో వివిధ పార్టీలు ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభలకు ప్రజలను తరలించడానికి ఆర్టీసీ బస్సులను వినియోగిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు పదుల సంఖ్యలో బస్సులను సభలకు పంపుతున్నారు. దీంతో బస్సులు లేక నిర్ణిత సమయం వరకు వేచి చూసి విద్యార్థులు ఇళ్లకు వెళ్తున్నారు. అలాగే ప్రతిరోజు విధులకు వెళ్లే ఉద్యోగులు సైతం బస్సులు లేకపోవడంతో ఆలస్యంగా కార్యాలయాలకు వెళ్తున్నారు.


కొయ్యగుట్ట వద్ద బస్సు కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలి



నాగిరెడ్డిపేట : ప్రతి ఓటరుకు తప్పనిసరిగా ఓటరు స్లిప్‌ను అందజేయాలని తహసీల్దార్ మహేందర్‌కుమార్ సూచించారు. మండలంలోని పలుగ్రామాలకు చెందిన బీఎల్‌వోలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ నెల 17 నుంచి 21 వరకు గ్రామాల్లో ఓటర్లకు స్లిప్‌లను అందించాలన్నారు. స్లిప్‌లను నేరుగా ఓటర్లకే అందజేయాలని ఆదేశించారు. వలస వెళ్లిన వారిని గ్రామానికి పిలిపించి వారికే స్లిప్‌లను అందించాలన్నారు. ఓటర్ స్లిప్‌ల పంపిణీకి ఈ నెల 21వ తేది ఆఖరు తేది అని చెప్పారు. 21 వరకు పంపిణీ చేయగా మిగిలిన స్లిప్పులను తమ కార్యాలయంలో అప్పగించాలన్నారు. దీంతోపాటు గ్రామాల్లో మోడల్ కోడ్ కండక్ట్(ఎంసీసీ)ను పకడ్బందీగా అమలు పర్చాలన్నారు. ఎంపీడీవో రఘు, ఎస్సై రాజు, ఏవో విజయశేఖర్, ఎంసీసీ మండల నోడల్ ఆఫీసర్ వరుణ్‌రాజ్ పాల్గొన్నారు.

అభ్యర్థులు ఖర్చుల వివరాలను అందించాలి



ఎల్లారెడ్డి : ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు వారి ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు అధికారులకు అందించాలని రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్ అన్నారు. గురువారం రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల వాహనాలకు అనుమతులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల అబ్జర్వర్ జగదీశ్‌షా, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ సురేష్ తదితరులున్నారు.

జెమ్ పోర్టల్‌లో కొనుగోలు చేయాలి



ఎల్లారెడ్డి : పంచాయతీ కార్యదర్శులు వారి జీపీలకు సంబంధించిన వస్తువులను జెమ్ పోర్టల్ ద్వారా కొనుగోలు చేయాలని డీఎల్‌పీవో సురేందర్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. సెల్ టవర్ల ఏర్పాటుకు రా పోర్టల్ ఆధారంగా వివరాలను నమోదు చేయాలన్నారు. ఎంపీవో ప్రకాష్ తదితరులున్నారు.

జీపీ రికార్డుల పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డి మండలం మౌలాన్‌ఖేడ్ పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను డీఎల్‌పీవో సురేందర్ గురువారం పరిశీలించారు. అనంతరం గ్రామంలో మురికి కాలువలు, నీటి తొట్టిలను పరిశీలించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి ఉన్నారు.

సెల్‌ఫోన్ అందజేత



పిట్లం: ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి ఎస్సై విజయ్‌కొండ గురువారం తిరిగి అందజేశారు. కల్హేర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన రామాగౌడ్ ఫోన్ కొన్నిరోజుల క్రితం పిట్లంలో పోయింది. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను కనుగొని బాధితుడికి అందజేశారు.

బస్టాండ్‌లో సీసీ పనులు ప్రారంభం



దోమకొండ: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఆర్టీసీ నిధులతో పనులను ప్రారంభించగా, జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు



రామారెడ్డి: ఎన్నికల నేపథ్యంలో రామారెడ్డితో పాటు పలు చోట్ల గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు చేశారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లుగా డీటీ షరీఫ్ తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం.మధుసూధన్ (ACO) : 99510 27699
డి.యల్.ఎన్.గౌడ్ (ఎల్లారెడ్డి) : 95731 30288
కె.రాజు (కామారెడ్డి) : 99496 99861
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899